




# కరపత్రం

SINCE 2014

సోమవారం అక్టోబరు 20 2025 | సంపుటి : 2 | సంచిక : 17 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## 'కొందరు అతి చేస్తున్నారు'..

విమర్శలపై డీకే శివకుమార్



2లో

## బిహార్ పోరు..

అన్ని పార్టీల్లో వారసత్వ రాజకీయాలు!



2లో

## మహారాష్ట్రలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు: రాజ్ ఠాక్రే



2లో

# గాంధీ కుటుంబం దేశానికి స్ఫూర్తినిచ్చింది: సీఎం రేవంత్‌రెడ్డి



- భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఓటమికి ధరణి చట్టమే కారణం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.
- హైదరాబాద్ శిల్పకళా వేదికలో సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
- గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టం కొంతమంది 'దొరలకు చుట్టంగా' మారి, భూమిపై ఆధిపత్యం చెలాయించడానికి ఉపయోగపడిందని ఆరోపించారు.

2లో

## భారత రాష్ట్రసమితి ఓటమికి ధరణి చట్టమే కారణం: సీఎం రేవంత్

- భూమి మీద ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగాయని గుర్తుచేశారు.
- సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు తిరగబడే అవకాశం ఉందని హెచ్చరించారు.
- హైదరాబాద్ శిల్పకళా వేదికలో సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు పంపిణీ చేసిన సందర్భంగా, లైసెన్స్ పొందిన సర్వేయర్లంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి, రైతులకు సాయం చేయాలని కోరారు.

2లో

## రేవంత్‌రెడ్డికి బంపర్ ఆఫర్ ఇస్తున్నా..

భూములు ఎక్కడున్నాయో చూపాలి: కేటీఆర్



మిగతాది 2లో

## నిందితుడికి మంత్రి కొండా సురేఖ ఆశ్రయం ఇవ్వడమా?: సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్: సిమెంటు కంపెనీలకు బెదిరింపుల వ్యవహారంలో నిందితుడిగా ఉన్న మాజీ ఓఎస్డీ సుమంత్.. మంత్రి కొండా సురేఖ ఇంట్లో ఎందుకు ఉన్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. నిందితుడికి ఆశ్రయం ఇవ్వడం సరైందేనా? నిలదీశారు. "మంత్రి ఇంటికి వెళ్లేందుకు పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారు? నిందితుడిని కొండా సురేఖ కారులో తీసుకెళ్తే చర్యలు తీసుకోరా? ఈ అంశంలో అసలేం జరిగింది.. ఎక్కడ సెటిల్‌మెంట్ జరిగింది? మంత్రి కుమార్తె ఏకంగా సీఎంపైనే ఆరోపణలు చేస్తే వివరణ ఎందుకు ఇవ్వలేదు?" అని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు.


## ఏపీకి మేలు చేసే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టొద్దు:

ప్రవాసాంధ్రులతో భేటీలో మంత్రి లోకేశ్



మిగతాది 2లో

## తితిదేలో వైకాపా కోవర్టులను నిరోధించండి: సీఎంను కోరిన ఉద్యోగ సంఘాల నేతలు



తిరుపతి (అలిపిరి): తితిదేలో వైకాపా కోవర్టులను నిరోధించాలని, పరకామణిలో దోషులను శిక్షించాలని, శ్రమ దోపిడీకి పాల్పడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు దేవస్థానం ఉద్యోగ సంఘాల నేతలు సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. తితిదే సర్వీస్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ చైర్మన్ జేవీ నరసింహమూర్తి, టీఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బాలాజీ తదితరులు అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు.

మిగతాది 2లో

## కూర్మనాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబరు 20 2025

# రేవంత్‌రెడ్డికి బంపర్ ఆఫర్ ఇస్తున్నా..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారని భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఇప్పటివరకు ఒక్క పెద్ద వ్యక్తి ఇల్లు అయినా కూలగొట్టారా అని నిలదీశారు. మూసీకి అడ్డంగా కడుతున్నవారిని ఎవరూ పట్టించుకోవట్లేదని వ్యాఖ్యానించారు. ఆదివారం రాజేంద్ర నగర్, జూబ్లీహిల్స్ నేతలు పలువురు భారత రాష్ట్ర సమితిలో చేరారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "బడా నేతల ఇళ్లు కూల్చడానికి హైడ్రాకు దారి దొరకట్లేదు. పేదల వద్ద నివాస పత్రాలు ఉన్నా రాత్రికి రాత్రే కూలుస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు చెరువులో ఉంది. ఆ ఇంటి జోలికి మాత్రం వెళ్లరు. పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్ చెరువులో ఉన్నా పట్టించుకోరు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ ఇళ్లు చెరువులోనే ఉన్నా టచ్ చేయరు. కేవీపీ రామచంద్రరావు ఇంటి జోలికి కూడా వెళ్లరు. పెద్దల ఇళ్ల చిరునామాలు హైడ్రాకు తెలియదు. పేదల ఇళ్లు కూలిస్తే అడిగేవారు లేరని భావిస్తున్నారు.

పెద్దల వద్ద డబ్బులు గుంజి బెదిరింపులకు దిగుతున్నారు. స్థిరాస్తి వ్యాపారం కుప్పకూలడానికి ప్రభుత్వ విధానాలే కారణం. అధికారంలోకి రాగానే సీఎం మొదట దెబ్బకొట్టింది రాజేంద్రనగర్ నియోజకవర్గాన్నే. 2023 కేబినెట్ భేటీలో 400 కిలోమీటర్ల మెట్రో మంజూరు చేశాం. ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్లు పూర్తి చేస్తే రేవంత్‌రెడ్డి వచ్చాక రద్దు చేశారు. నాకు భూములు ఉన్నాయనే అనుమానంతో ఇలా చేశారు. రాజేంద్రనగర్‌లో భూములున్నాయని సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేశారు. భూములు చూపితే రాసిస్తానని సబితా ఇంద్రారెడ్డి చెబుతున్నారు. రేవంత్‌రెడ్డికి బంపర్ ఆఫర్ ఇస్తున్నా.. భూములు ఎక్కడున్నాయో చూపాలి. కంపెనీలు, భవనాలు నావే అని చెబుతూ రెండేళ్లుగా జల్లెడ పడుతున్నారు. గత దీపావళికి మంత్రి బాంబులేటి.. బాంబులు పేలతాయన్నారు. మళ్లీ దీపావళి వచ్చింది. భారత రాష్ట్ర సమితి హయాంలో పారిశ్రామికవేత్తలకు గొడుగులు పట్టి తీసుకెళ్లాం. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామివేత్తలకు తుపాకులు పెడుతున్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా దందాలు చేస్తోంది." అని కేటీఆర్ అన్నారు.

## తితిదేలో వైకాపా కోవర్టులను నిరోధించండి:

మొదటిపేజీ తరువాయి

పరకామణిలో గత రెండేళ్లుగా ఒక ప్రైవేటు కాంట్రాక్టర్ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని, తితిదేకి నష్టం వాటిల్లే రీతిలో అతని చర్యలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు.

భూమన కరుణాకర్ రెడ్డికి అనుకూలంగా కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తెదేపా సానుభూతి పరులుగా ఉన్నవారికి బదిలీల అంశంలో న్యాయం జరగటం లేదంటూ విన్నవించారు. లైసెన్సు పోర్టర్లకు కోర్టు నుంచి ఆదేశాల వచ్చినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదని, దేవస్థానం ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కరించాలని, ప్రస్తుతం శాశ్వత ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారికి సర్వీసు రిజిస్టర్లలో లోపాలను సరిచేయాలని, టీఎన్‌టీయూసీకి గతంలో ఉన్న విధంగానే తితిదే ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించాలని విన్నవించారు. ఉద్యోగ సంఘాల నేతల వినతులపై.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, ఉద్యోగుల సమస్యలపై ఉన్నతాధికారులతో, పాలక మండలితో చర్చించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని సీఎం హామీ ఇచ్చినట్టు నేతలు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏపీకి మేలు చేసే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టొద్దు:

మొదటిపేజీ తరువాయి

సిడ్నీ: కూటమి ప్రభుత్వం పట్టుదలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా ఉండేలా కృషి చేస్తోందని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేశ్.. సిడ్నీలో ప్రవాసాంధ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగువారి సత్తాను ప్రపంచానికి పరిచయం చేసింది సీఎం చంద్రబాబేనని లోకేశ్ అన్నారు. ఆయన వయసు 75 ఏళ్లయినా.. 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తున్నారని చెప్పారు. వైకాపా హయాంలో చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు ప్రవాసాంధ్రులంతా ఆయనకు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు.

"చాలా రాష్ట్రాల్లో డబులింజన్ సర్కార్లు ఉన్నాయి. కానీ.. ఏపీలో డబులింజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. ఒక్క జూమ్‌కాల్‌తో ఆర్సెలార్ మిత్తల్ కంపెనీ ఏపీలో పెట్టుబడులకు అంగీకారం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం చంద్రబాబు కోరగానే ప్రధాని మోదీ సహకరించారు. పవన్‌కల్యాణ్ సహకారంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. అన్నిరంగాల్లో రాష్ట్రం నంబర్ వన్‌గా ఉండేలా కృషి చేస్తోంది. పోలవరం పనులు పూర్తిచేసి నీరందిస్తాం. రాష్ట్రానికి మేలు చేసే ఎలాంటి అవకాశాన్ని కూడా వదిలిపెట్టవద్దు. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం. ఆస్ట్రేలియా కంపెనీల్లో పనిచేసే తెలుగువారు ఏపీ అంబాసిడర్లలా పనిచేయాలి. మీ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టే అవకాశముంటే మాకు చెప్పండి.. అన్ని విధాలుగా సహకారం అందిస్తాం. పెట్టుబడుల కోసం పక్క రాష్ట్రాలతో చిన్న చిన్న యుద్ధాలు జరుగుతున్నాయి. నన్ను ఎన్నో మాటలు అంటున్నారు.. క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్తున్నా. రాష్ట్రాలు పరస్పరం పోటీ పడితేనే భారత్ గెలుస్తుంది" అని లోకేశ్ చెప్పారు.

## కూర్మనాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

మొదటిపేజీ తరువాయి

శ్రీకూర్మం: శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆదివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి.. పురాణ ప్రాశస్త్యం గురించి తెలుసుకున్నారు. పుష్కరిణి పరిసర ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేయొచ్చో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. దేశంలోనే 7వ శతాబ్దానికి చెందిన ఏకైక పురాతన కూర్మనాథ ఆలయాన్ని మరింత అభివృద్ధి చెయ్యాల్సిన అవశ్యకత ఎంతో ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. మొదటి విడతగా శ్వేత పుష్కరిణి, పిండ ప్రదాన ప్రాంతంలో భవనం, పార్కింగ్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. దీని కోసం ఇండిగో సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

# మహారాష్ట్రలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు: రాజ్ ఠాక్రే

మొదటిపేజీ తరువాయి

మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు చేరారని ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే ఆరోపించారు. ఓటర్ల జాబితాను సరిచేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. అవకతవకలతో కూడిన ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తే.. అది ఓటర్లకు అవమానకరమని పేర్కొన్నారు. నకిలీలను గుర్తించేందుకు ఓటర్ లిస్టులను పరిశీలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

"ప్రాంతీయ పార్టీలను అంతం చేసే కుట్ర జరుగుతోంది. రానున్న ఎన్నికల కోసం రాష్ట్ర ఓటర్ల జాబితాలో 96 లక్షల మంది నకిలీ ఓటర్లు చేరారని తెలిసింది. ముంబయిలో 8-10 లక్షల మంది, ఠాణె, పుణె, నాసిక్‌లలో 8-8.5 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇదే జరిగింది. ఇలాగే ఎన్నికలు నిర్వహిస్తే.. అది ఓటర్లను, దేశాన్ని అవమానించడమే అవుతుంది" అని రాజ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తే అధికార పార్టీలు కలత చెందుతున్నాయని, ఇది వారిని బాధపెడుతోందన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే.. తొలుత ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని రాజ్ ఠాక్రే డిమాండ్ చేశారు. నకిలీ ఓటర్లను చేర్చడం ద్వారా ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటోందని నేరుగా భాజపా పేరు ప్రస్తావించకుండా ఆరోపించారు. ఓటేసినా.. వేయకపోయినా.. మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని, ఇది ఎటువంటి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎస్‌కు దారుణ ఫలితాలు రావడంపై స్పందిస్తూ.. ఓటింగ్ ప్రక్రియే రాజీపడితే తమకు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎలా ఉంటారన్నారు. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ ఎలా గెలిచిందో అందరికీ తెలుసన్నారు.

మహారాష్ట్రలో గతేడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకొన్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పలుమార్లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. 2019-24 మధ్య మహారాష్ట్రలో 31 లక్షల మంది ఓటర్లు పెరిగితే.. ఆ తర్వాత ఐదు నెలల్లోనే 41 లక్షలమంది పెరిగారన్నారు. ఇటీవల కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ), ఎంఎన్ఎస్ తదితర ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల అధికారులను కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

## గాంధీ కుటుంబం దేశానికి స్ఫూర్తినిచ్చింది: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మన దేశంలో అన్ని మతాల సహజీవనం స్ఫూర్తినిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబం కూడా దేశానికి అదే విధంగా స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ సభ నిర్వహించారు. రాజీవ్ చిత్రపటం వద్ద సీఎం, మంత్రులు నివాళులర్పించారు. "గత 35 ఏళ్లుగా రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర జరుగుతోంది. గాంధీ.. దేశానికి పర్యాయపదం. తమపై పోరాడిన మహాత్మాగాంధీని బ్రిటిషర్లు ఏమీ చేయలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది నెలల్లోనే మతతత్వవాదులు ఆయన్ను పొట్టనపెట్టుకున్నారు. గాంధీని హత్య చేసిన వారు బ్రిటీషనర్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తులు. దేశ సమగ్రత, సమైక్యత కాపాడటానికి ఇందిరాగాంధీ ప్రాణాలు కోల్పోయారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితోనే కులగణన చేసి, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం అన్నారు. ఎమ్మెల్యేల అర్హత వయస్సు 21 ఏళ్లకు కుదించాలని, ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తామన్నారు.

## భారత రాష్ట్రసమితి ఓటమికి ధరణి చట్టమే కారణం: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భూమి మీద ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగాయని, సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు తిరగబడే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టం.. కొంతమంది దొరలకు చుట్టంగా మారిందన్నారు. ఆ చట్టాన్ని అడ్డుపెట్టుకొని భూమి మీద అధిపత్యం చెలాయించాలని చూశారన్నారు.

" మా గెలుపునకు అనేక కారణాలు ఉండొచ్చు. కానీ, భారత రాష్ట్ర సమితి ఓటమికి ధరణి చట్టమే కారణం. అధికారంలోకి వస్తే ధరణి నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం మా ప్రభుత్వం రాగానే ఆ చట్టాన్ని తొలగించి భూ భారతి తీసుకొచ్చాం. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదు. ఇచ్చినా పరీక్షలు పెట్టలేదు. ఒకవేళ పరీక్షలు పెట్టినా ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవి. గత ప్రభుత్వ హయాంలో టీజీపీఎస్సీ పునరావస కేంద్రంగా ఉండేది. మా ప్రభుత్వం రాగానే ప్రక్షాళన చేశాం. ఏడాదిలోనే 60వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. మేం ఉద్యోగాలు ఇస్తుంటే.. కోర్టులో కేసులు వేసి అపాలని చూస్తున్నారు. కోర్టుల్లో పోరాడి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్నాం. త్వరలోనే గ్రూప్-3, గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తాం. లైసెన్స్ పొందిన సర్వేయర్లంతా బాధ్యతా యుతంగా వ్యవహరించి, రైతులకు సాయం చేయాలి" అని రేవంత్ అన్నారు.

## హైదరాబాద్‌లో కిటకిటలాడుతున్న టపాసుల దుకాణాలు



హైదరాబాద్: భాగ్యనగరంలో టపాసుల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. దీపావళి పండుగ రేపే కావడంతో అబిడ్స్, బేగంబజార్ ప్రాంతాల్లోని బాణసంచా దుకాణాలకు ప్రజలు పోటెత్తారు. దీపావళి అంటే పటాకుల మోత మోగించాల్సిందే. కాకరపూల వెలుగులు, టపాసుల ఢాం..ఢాం శబ్దాలతో హైదరాబాద్‌లో పండుగ శోభ సంతరించుకుంది. వివిధ రకాలపైన పటాకులు, క్రాకర్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి ధరలు తక్కువగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి అన్ని వస్తువుల ధరలు వినియోగదారులకు అందుబాటులోనే ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

# 'కొందరు అతి చేస్తున్నారు'.. విమర్శలపై డీకే శివకుమార్

మొదటిపేజీ తరువాయి

బెంగళూరు రహదారుల దుస్థితి, ట్రాఫిక్ సమస్యలపై కొంతకాలంగా కర్ణాటక సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు ఈ సమస్యలను లేవనెత్తారు. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. విమర్శలు స్వీకరించేందుకు తాను సిద్ధమేనని, కానీ.. కొంతమంది అతి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అటువంటి వాటికి తాను భయపడనని చెప్పారు.

"బెంగళూరు నగర జనాభా 1.40 కోట్లు. స్థానికంగా 1.23 కోట్ల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. రోజుకు కొత్తగా మూడు వేల వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయని రవాణాశాఖ మంత్రి చెబుతున్నారు. ఉపాధి, విద్య, ఇతర పనుల కోసం 70 లక్షల మంది బెంగళూరుకు వస్తుంటారు. నగర జనాభా పెరుగుతోంది. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలు కాంగ్రెస్ సర్కారుకు ఒక అవకాశం ఇచ్చారు. మేం సేవ చేయాలనుకుంటున్నాం" అని ఓ కార్యక్రమంలో శివకుమార్ తెలిపారు.

"ఇక్కడ వ్యాపారాలు ప్రారంభించిన కొంతమంది నేడు ఉన్నత స్థాయికి ఎదిగారు. అయితే.. వారు తమ మూలాలను మర్చిపోయారు. ట్వీట్‌ల ద్వారా విమర్శలు చేస్తున్నారు. నేను విమర్శలను స్వాగతిస్తున్నాను. ఈ విషయంలో ఎటువంటి సమస్య లేదు. ఎందుకంటే.. అవి ప్రజాస్వామ్య విలువలను పెంచుతాయి. కానీ.. ఈ ముసుగులో కొందరు అతి చేస్తున్నారు. ఇటువంటి విషయాలు నన్ను ఇబ్బంది పెట్టవు. ప్రజలు మాకు ఒక అవకాశం ఇచ్చారు. మేం వారికి సేవ చేయాలనుకుంటున్నాం" అని డీకే వ్యాఖ్యానించారు.

రోడ్లపై గుంతల సమస్యను వాట్సప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు పౌరులకు అవకాశం కల్పించినట్లు డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా ప్రజలకు ఇలాంటి అవకాశం లేదన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర (%ఖుతీఅఖ్ఖుఖ్ను చీవఙం%) హోంశాఖ మంత్రి జి.పరమేశ్వర సైతం స్పందించారు. సమస్యలపై బహిరంగ ప్రకటనలు, మీడియా ముందు మాట్లాడటం వంటివి చేయకుండా.. సీఎం, లేదా బెంగళూరు ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత ప్రకటనలు నగరంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఆలోచించాలన్నారు.

# బిహార్ పోరు..

## అన్ని పార్టీల్లో వారసత్వ రాజకీయాలు!

మొదటిపేజీ తరువాయి



ఎన్నికల సమయంలో వారసత్వ రాజకీయాలను ప్రచారాస్త్రంగా మార్చుకుని ప్రత్యర్థులపై విరుచుకు పడుతుండటం చూస్తుంటాం. కానీ, బిహార్‌లో మాత్రం ఆ మాట ఊసే లేదు. ఎందుకంటే అన్ని పార్టీలు రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నవే. అధికార భాజపా, జేడీయూ మొదలుకొని, ఆర్జేడీ సహా అన్ని పార్టీలదీ అదే తీరు. రాష్ట్రంలో ముఖ్య నాయకుల పుత్రరత్నాలు, సతీమణులు లేదా సమీప బంధువులు ఈ అసెంబ్లీ ఎన్నికల సమరానికి సై అంటున్నారు.

### భాజపా నుంచి ఆర్జేడీ వరకు..

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ వారసుడు తేజస్వీ యాదవ్ రాఘోపుర్ నుంచి పోటీ చేస్తున్నారు. తారాపుర్ నుంచి భాజపా నేత, ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి (మాజీ మంత్రి శకుని చౌదరి కుమారుడు), ఆర్జేడీ నేత ఒసామా సాహబ్ (మాజీ గ్యాంగ్‌స్టర్ మహమ్మద్ షాహబుద్దీన్ కుమారుడు) రఘునాథ్‌పుర్ స్థానం నుంచి పోటీలో ఉన్నారు. రాష్ట్రీయ లోక్ మోర్చాకు చెందిన స్నేహలత (పార్టీ అధినేత ఉపేంద్ర కుష్వాహా సతీమణి) ససారం నియోజకవర్గం నుంచి, భాజపా నేత నీతీశ్ మిశ్రా (మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కుమారుడు) ఝంఝార్‌పుర్, హిందుస్థాన్ ఆవామ్ మోర్చా నేత దీపా మాంఝీ (కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ కోడలు) ఇమామ్‌గంజ్ నుంచి, జన్ సురాజ్ నేత జాగృతి ఠాకుర్ (ప్రఖ్యాత సోషలిస్టు నాయకుడు కర్పూరీ ఠాకుర్ మనవరాలు) మోర్వా నుంచి, చాణక్య ప్రసాద్ రంజన్ (జేడీయూ ఎంపీ గిర్ధారీ ప్రసాద్ యాదవ్ కుమారుడు) బెల్హార్ స్థానం నామినేషన్లు దాఖలు చేశారు.

### భోజ్‌పురీ.. అసెంబ్లీ ఎన్నికలపై గురి!

జేడీయూ నేతలు కోమల్ సింగ్ (ఎల్జేపీ ఎంపీ వీణాదేవీ కుమార్తె) గయాఘాట్ స్థానం నుంచి, చేతన్ ఆనంద్ (ఎంపీ లవ్‌లీ యాదవ్ కుమారుడు) నబీనగర్ నుంచి పోటీ చేస్తున్నారు. నితిన్ నబీన్ (దివంగత భాజపా నేత నబీన్ కిశోర్ సిన్హా) బంకీపూర్ నుంచి, సంజీవ్ చురాసియా (భాజపా నేత గంగా ప్రసాద్ చురాసియా) దిఘా నుంచి, ఆర్జేడీ రాహుల్ తివారీ (సీనియర్ నేత శివానంద్ తివారీ కుమారుడు) షాహ్‌పుర్ నుంచి పోటీ చేస్తున్నారు. భాజపా నేత రాకేశ్ ఓఝా (దివంగత విశ్వేశ్వర ఓఝా కుమారుడు), వీణా దేవీ (ఆర్జేడీ నేత సూరజ్‌భాన్ సతీమణి) మోకామా నుంచి, శివానీ శుక్లా (ఆర్జేడీ కీలక నేత మున్నా శుక్లా కుమార్తె) లాల్‌గంజ్ నుంచి పోటీలో ఉన్నారు.

### విలువలకు తిలోదకాలు..

పార్టీల్లో వారసుల తీరును చూస్తుంటే సైద్ధాంతిక నిబద్ధత, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలను వారు పెద్దగా పట్టించుకోవడం లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోందని ఏఎన్ సిన్హా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ విద్యార్థి వికాస్ పేర్కొన్నారు. రాజకీయ కుటుంబాలకు చెందడంతోనే వారి వారసులు తేలికగా ప్రవేశిస్తున్నారని, ఇటువంటి పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాల్సిన అవసరం ఉందన్నారు. 77 ఏళ్లలో రాష్ట్రంలో విద్యకు సరైన ప్రాధాన్యం కల్పించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని అభిప్రాయపడ్డారు.

### సాధారణ కార్యకర్తకు కష్టమే..

బిహార్ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాస్థాయిలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇటీవల సర్వేలో చూస్తే కేవలం 14.71శాతం మంది మాత్రమే పదో తరగతి ఉత్తీర్ణత సాధించినవారున్నారని వికాస్ పేర్కొన్నారు. వారికి రాజకీయంగా అవగాహన లేనందునే నేతలు వారి వారసులను రాజకీయాల్లోకి తీసుకొస్తున్నారని చెప్పారు. ఈ రోజుల్లో ఓ సాధారణ పార్టీ కార్యకర్త ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితులు లేని మాట నిజమేనని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ పేర్కొన్నారు. సంస్థాగతంగా పనిచేసే, ప్రజాసేవ చేసే సమర్థత కలిగిన వారికే తమ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని భాజపా అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ వెల్లడించారు.

# పాలనాధికారం కాంగ్రెస్ అగ్రవర్ణాలకు
# పసలేని పదవులు బిసి లకు

**- యర్రమల్ల భాస్కర్, నల్గొండ**

» తెలంగాణలో BC లను మోసం చేస్తున్నదెవరు?
» కాంగ్రెస్ పార్టీ ఆటల మర్మమేమిటి?




పాలనాధికారం కాంగ్రెస్ అగ్రవర్ణాలకు పసలేని పదవులు బిసి లకు

**యర్రమల్ల భాస్కర్, నల్గొండ**

తెలంగాణలో BC సమాజం ఇప్పుడు రోడ్డుపైకి వచ్చి తమ హక్కుల కోసం పోరాడుతోంది. ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల గురించి మాత్రమే కాదు – ఇది కాంగ్రెస్ పార్టీ యొక్క ద్వంద్వ వైఖరి, మోసం మరియు కుల రాజకీయాల గురించి!

సోదరులారా! నేను కులాలకు వ్యతిరేకం, కానీ సామాజిక న్యాయం కోసం గట్టిగ నిలబడే వాణ్ని. అలాగని రెడ్ల కో ఇంకెవరికో వ్యతిరేకం కాదు.

**మన సమాజం ఒక కుటుంబం.**
ఒక కుటుంబంలో కొందరికి మాత్రం తిండి, నీడ, సకల సౌకర్యాలు ఇస్తూ కొందరిని తీవ్ర నిర్లక్ష్యం చేయడం వారికి గౌరవం ఇవ్వక పోవడం, వారికి వారి హక్కుగా రావాల్సినవి కూడ అందకుండా అడ్డుకోవడం లాంటి చర్యలకు వ్యతిరేకం.
దేశం మొత్తం ఒకే కుటుంబం, అనుకుంటే అందరికీ సమ న్యాయం జరగాలి కదా!

ఈ విషయాన్ని లోతుగా విశ్లేషించి, చారిత్రక నేపథ్యం నుంచి ప్రస్తుత పరిస్థితి వరకు వరుస క్రమంలో వివరిస్తాను.
**– ఇది BC సమాజానికి ఆలోచనాత్మకమైన సందేశం. బిసి సోదరులు ఐక్యంగా ఉండాలి, మోసాన్ని ఎదుర్కోవాలి**

చారిత్రక నేపథ్యం: పాత రోజుల్లో రెడ్డి ప్రభుత్వాల్లో కూడా సాధ్యమైనంత సమతుల్యత పాటించే వారు.

» **1968 ల లో స్వర్గీయ కాసు బ్రహ్మానంద రెడ్డి గారు, తరువాత ఒక ఏడాది కాలం స్వర్గీయ పి.వి.నర్సింహా రావు గారు , శ్రీ జలగం వెంగళరావు గారు , T. అంజయ్య గారి వరకు కాస్త సామాజిక న్యాయం పాటించే వారు.**
» **స్వర్గీయ మర్రి చెన్నా రెడ్డి వంటి నాయకులు ముఖ్యమంత్రులుగా, ఉన్నప్పటికీ, వారు మంత్రివర్గం మరియు నామినేటెడ్ పదవుల్లో ఇతర కులాలను నిర్లక్ష్యం చేయలేదు.**
కానీ మర్రి చెన్నా రెడ్డి గారి 1978- 80 హయాంలోనే ఈ ధోరణి కొంచెం మొదలైంది.

ఇందిరా గాంధీకి విధేయత చూపి, తన కులానికి ముఖ్యంగా తెలంగాణ లో పేద గుటాటి రెడ్లకు ప్రాధాన్యం ఇచ్చారు.
స్వర్గీయ అరుగుల రాజారామ్ BC నాయకుడు, ఉప ముఖ్యమంత్రి వంటి వారు చెన్నారెడ్డి కి ప్రత్యర్థులు. వారు అనుమానాస్పద ఆక్సిడెంట్‌లో మరణించడం అప్పట్లో చర్చనీయాంశం అయింది.
బాలగౌడ్ బిసి నాయకుడు. కాంగ్రెస్ లో ఆర్థికంగా కూడ బలమైన బిసి నాయకుడు మరియు ఎంపి.
వీరిద్దరిని తొక్కడం కోసం, ఇంకో బిసి నాయకుడు స్వర్గీయ శ్రీ శివశంకర్ గారిని చెన్నారెడ్డి ప్రోత్సహించాడు. శివశంకర్ గారు అప్పటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ గారికి సన్నిహితులు.
వారి కోటరీ మనిషి. ఇలాంటి ఒక దీజ నాయకుని తో ఇంకో బిసి నాయకుడు అయిన T బాలాగౌడ్ గారిని ఔట్ చేయడం రాజకీయ కుట్ర.
ఇవన్నీ కుల రాజకీయాలకు ఉదాహరణలు.
కానీ అప్పటి వరకు, రెడ్ల ప్రభుత్వాలు ఉన్నా కూడా ఇతర కులాల పట్ల కొంత సమతుల్యత చూపేవి.

**– ఇప్పుడు మాత్రం పచ్చిగా రెడ్డి ఆధిపత్యం నడుస్తున్నది. పర్యవసానం బిసి ల్లో ఉవ్వెత్తున లేస్తున్న అసంతృప్తి.**

**– కాంగ్రెస్ పార్టీ యొక్క దీర్ఘకాలిక మోసం్న స్వాతంత్ర్యం తర్వాత నుంచి కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లలో 50 ఏళ్లు దేశాన్ని పాలించింది.**
అందులో గాంధీ-నెహ్రూ ల కుటుంబం 40 ఏళ్లు దేశాన్ని పాలించారు.
ఈ దీర్ఘ కాలం బిసి లను నిర్లక్ష్యం చేసింది కాంగ్రెస్ పార్టీ కదా!

» **నెహ్రూ గారు రిజర్వేషన్లకు వ్యతిరేకి, రాజీవ్ గాంధీ గారు కూడా అదే మాటలు చెప్పారు**

ఇప్పుడు రాహుల్ గాంధీ గారు " కిస్ నే కిత్నీ భాగీ
దార్, ఉస్ నే ఉత్నా హిస్సేదార్" అంటూ జనాభా ప్రకారం వాటా అని నినాదాలు ఇస్తున్నారు.

» **కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో 2012 లో చేసిన కుల గణన సర్వేను బయటపెట్టకుండా మరోసారి సర్వే చేస్తున్నారు.**

ఆ నివేదికను మనం ఎందుకు దాచిపెట్టారు? BC \T, SC/ST లు ఎక్కువ జనాభా ఉంటే తగిన వాటా ఇవ్వాలి కదా?

» **తెలంగాణలో కాంగ్రెస్ తాజా మోసం**
2023 ఎన్నికలు మరియు తర్వాత
2023 అసెంబ్లీ ఎన్నికల్లో BJP BC ముఖ్యమంత్రి చేస్తాం" అని మానిఫెస్టోలో పెట్టింది.
ఈ విషయాన్ని ప్రధాని మోడీ బహిరంగ సభల్లో చెప్పారు.
కానీ కాంగ్రెస్ అసాధ్యమైన ఉచిత హామీలతో గెలిచి, రేవంత్ రెడ్డిని CM చేసింది.
రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం BC లకు మంత్రివర్గంలో సరైన వాటా ఇవ్వలేదు.
రాహుల్ గాంధీ చెప్పినట్టు కుల గణన చేసి, డేటా బయటపెట్టకుండా తప్పుడు GO లు ఇచ్చి స్థానిక ఎన్నికలు ప్రకటించారు.
ఫలితం? ఒక రెడ్డిగారు తన ప్రజాస్వామ్య బద్ధ హక్కుగా కోర్టుకు వెళ్లి ఎన్నికలు ఆపించాడు.
తెలంగాణలో BC లు 55-60% జనాభా ఉన్నారని అందరూ ఒప్పుకుంటారు.
మరి రాహుల్ సిద్ధాంతం ప్రకారం వారికి 50 శాతం వాటా ఇవ్వాలి.
రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి, క్యాబినెట్‌లో సగం సీట్లు ఇవ్వాలి.
» **ప్రభుత్వంలో బిసి లకు తగిన వాటా ఎందుకు ఇవ్వడం లేదు?**
» **కుల గణన డేటా ఎందుకు బయటపెట్టడం లేదు?**
» **దీనికి ఎవరు అడ్డు వస్తారు. ఏ కోర్టులు ఆపలేవు కదా!**

» **దీజల్లో ఐక్యత లేమి**

అసలు సమస్య బిసి లే సృష్టించుకుంటున్నారు.
రెడ్లలో శాఖలున్నాయి. గుటాటి, మోటాటి, దొరలు, దేశముఖ్ లతో పాటు కాపు వర్గాలు ఉన్నా, రాజకీయాల్లో ఐక్యంగా ఉంటారు.

» **కానీ దీజ ల్లో ముదిరాజ్, పద్మశాలి, యాదవ్,గౌడ్, నాయి బ్రాహ్మణ,రజక, కుమ్మరి,వడ్ల ఇలా వివిధ వృత్తి కులాల మధ్య వారిలో వారే చిన్నచూపు చూసుకుంటారు**
» **ఇక మాల-మాదిగలు కూడా ఐక్యంగా లేరు**

ఇది కాంగ్రెస్ వంటి పార్టీలకు అవకాశం ఇస్తోంది.
R. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ వంటి దీజ నాయకులు కాంగ్రెస్‌ను, సి. ఎం గారిని ఎందుకు నిలదీయడం లేదు?

» **ఇంకో విచిత్రం**
కమ్యూనిస్ట్ ప్రభావిత సంఘాలు,సూడో దళిత క్రైస్తవుల సంఘాలు కులగణన విషయంలో జనాల్ని అయోమయానికి గురి చేస్తున్నాయి.త్రిశంకు స్వర్గంలో వేలాడుతున్నాయి.

» **కుల వివక్ష పోరాట సమితి అంటూ యూ ట్యూబ్ లో పోరాటం చేసేవారు, కుల నిర్మూలన సమితి అంటూ హడావిడి చేసే క్రిప్టో క్రైస్తవ నాయకత్వ సంఘాలు కాంగ్రెస్ మోచేతి నీళ్లు తాగుతూ ప్రజలను వంచిస్తున్నారు**

కుల నిర్మూలన కోరుకునే వారు, కాంగ్రెస్ కుల గణన నినాదంతో మైమరచి పోయారు.
» **కుల గణన ను సమర్థించే ఈ సంఘాలు కుల వివక్షను ఎలా రూపుమాపుతారు? కుల నిర్మూలన ఎలా చేస్తారు?**

అందుకే భారత ప్రజలు ఈ కాంగ్రెస్,కమ్యూనిస్టు ఇస్లాం క్రైస్తవ సూడో దళిత సంఘాల ద్వంద్వ నీతిని, కపట నినాదాలను విసిరి కొడుతున్నారు.

» **కాంగ్రెస్ మోసాన్ని బయటపెట్టడం**
రాహుల్ గాంధీ యొక్క ద్వంద్వ వైఖరి పై తెలంగాణా కుల సంఘాల వైఖరి ఏమిటి?
రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో, బయట "కుల గణన గురించి గొప్పలు చెబుతారు".
కానీ తెలంగాణలో కులాల వారీ డేటా దాచిపెట్టడం ఎందుకు, దాన్ని బిసి సంఘాల నాయకులు ఎందుకు గట్టిగ నిలదీయరు?.
వారి వారి జనాభా ప్రకారం బిసి లకు ప్రభుత్వం లో వాటా ఇవ్వకపోవడం పచ్చి మోసం కాదా!
కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి ఒక రకం, దేశానికి మరో రకం రాజకీయ పొత్తులు. కర్ణాటకలో సర్వే దాచిపెట్టి మళ్లీ సర్వే చేయడం. ఇది దీజ లను మోసం చేయమే!

» **ఇప్పుడు బీసీ ల డిమాండ్.. కాల్ టు యాక్షన్**
BC లు ఐక్యంగా ఉద్యమం చేయాలి.
పి రేవంత్ రెడ్డి రాజీనామా చేయించి, దీజ ని ముఖ్యమంత్రి చేయాలి!
క్యాబినెట్‌లో బిసి లకు 50 శాతం వాటా ఇవ్వాలి!

» **కుల గణన డేటా తక్షణం బయటపెట్టాలి**

TV చర్చలు స్థానిక ఎన్నికల చుట్టూ తిప్పకుండా, అసలు సమస్యపై ఫోకస్ చేయాలి.
బిసి లు మళ్ళీ మళ్ళీ మోసపోకుండా, ఐక్యంగా పోరాడితే మాత్రమే మార్పు వస్తుంది.

» **కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఎదుర్కోండి**
» **BC లు జాగ్రత్తగా ఉండండి**
» **బిసి లు రాజ్యాధికారం సాధించాలి**

## వేములవాడకు విచ్చేసిన శృంగేరి పీఠాధిపతి

**- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు**
**-సాదరంగా ఆహ్వానించిన మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది**
**-స్వామివారిని చూసేందుకు భారీగా తరలివచ్చిన భక్తజనం**
**-పాల్గొన్న దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్, ఎస్పీ,**
**-నేడు రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల పరిశీలన, సలహాలు-సూచనలు**







**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహా స్వామి వారు ధర్మ విజయ యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం వేములవాడ విచ్చేశారు. స్వామివారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చెక్కపల్లి చౌరస్తాలోని తెలంగాణ చౌక్ నుండి రాజన్న ఆలయం వరకు స్వామివారి శోభాయాత్ర డప్పు చప్పుల మధ్య, బాణాసంచా పేలుళ్ల నడుమ ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో పట్టణవాసులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. స్వామి వారిని చూసేందుకు భక్తులు అధికంగా తరలిరావడంతో పట్టణంలోని తెలంగాణ చౌక్ నుండి రాజన్న ఆలయం వరకు కిక్కిరిసిపోయింది. నేడు రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులను పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇవ్వనున్నారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేష్ బి.గితే, అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, రాజన్న ఆలయ ఈవో ఎల్. రమాదేవి, పట్టణ సీఐ వీరప్రసాద్ పట్టణ పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## తెలుగు రాష్ట్రాలలో మరో గ్రంథాలయ ఉద్యమం

**కరపత్రం ప్రతినిధి మీణవంక అక్టోబర్ 19**
తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో మరో గ్రంథాలయ ఉద్యమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తేది:19-10-2025 రోజు సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు కరీంనగర్ మానేరు డ్యాం వద్ద గల




జింకల పార్కులో పుస్తక పఠనం కార్యక్రమాన్ని చేపట్టి పార్కులోకి వచ్చిన సందర్శకులను వారి పిల్లలను పుస్తకాల వైపు దృష్టి మళ్లించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కరీంనగర్ మరో గ్రంథాలయ ఉద్యమ కమిటీ సభ్యులు,కవి, గాయకులు గోనెల సమ్మన్నముదిరాజ్, తోడేటి చందు,మరియు ధరిపెల్లి మురళీ మాట్లాడుతూ నేటితరం పిల్లలు మరియు యువకులంతా మొబైల్ ఫోన్ మాయలో పడి వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, పిల్లలందరూ వాటి మాయలో పడకుండా పుస్తకాల వైపు వారి దృష్టిని మళ్లించాలని, చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని అట్టి విషయాన్ని గమనించాలని కోరినారు.ఈ కార్యక్రమంలో గోనెల సమ్మన్న ముదిరాజ్, తోడేటిచందు,దరిపెల్లి మురళి,గోనెల అఖిల్,గోనెల బిట్టు,రాయణవేణి అనిల్,గోనెల చందు,గోనెల హర్షిత్ ,గోనెల అరవింద్ సాయి,పాల్గొన్నారు.

## జీనియస్ చెస్ అకాడమీలో జరిగిన అండర్ 14 చదరంగ పోటీలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 19**
చదరంగం ఆటతో మెదశక్తితో పాటు ఏకాగ్రత పెరుగుతుందని వెంకట్ ఫౌండేషన్ అధినేత గంప వెంకట్ డివై.ఎస్.ఓ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం భగత్ నగర్ లోని జీనియస్ చెస్ అకాడమీ లో జరిగిన అండర్ 14 కరీంనగర్ జిల్లా బాలబాలికల చదరంగం పోటీలో ముఖ్యఅతిథిగా పాల్గొని మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్ , టీవీకి అలవాటు పడకుండా తల్లిదండ్రులు చదరంగం ఆటపట్ల మక్కువ చూపాలని కోరారు. గెలుపొందిన బాలబాలికల ఐదుగురు చొప్పున ఉమ్మడి జిల్లాకు ఎంపిక చేయబడుతుందని ఎస్ జి ఎఫ్ జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ తెలిపారు. విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ ఫౌండర్ కంకటి అనూప్ కుమార్, భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు అక్కినపల్లి నాగరాజు , కరీంనగర్ జిల్లా డెమొక్రటిక్ చెస్ డెవలప్మెంట్ కార్యదర్శులు కంకటి సుజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, ఏఎన్ఆర్ బిల్డర్ రాజ్ కుమార్, ఎన్నారై జగదీష్, సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కే కృష్ణ ,ఆర్ రాజకుమార్, సౌజన్య, బి .రాజ్ కుమార్, ప్రేమలత, బి .సత్యనారాయణ ,చిరంజీవి అనిల్ చీఫ్ ఆర్బిటర్, అరుణ్, ఆర్బిటర్లు రేవిక్ ,ప్రభుదేవా ,స్వాతి ,శ్రీ నిజ ,అభిరామ్, నితిన్, వివిధ పాఠశాల నుండి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం

**- తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ అందిస్తోంది. అందులో భాగంగా గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులు వారి యొక్క తెల్ల రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, యజమానురాలి బ్యాంకు ఖాతా, నాలుగు ఫోటోలు, ఫోన్ నెంబర్ తో స్వయంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారురాలు వేములవాడ పట్టణంలోని శ్రీ భువనేశ్వరి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో సంప్రదించి, ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొంది, ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


# మెరుపల్లి అయ్యప్ప స్వామి
## మాలధారణ కరపత్రం ఆవిష్కరణ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, అయ్యప్ప స్వామి భక్తులు మాలధారణ చేసుకునేందుకు నిర్ణయించిన తేదీలతో కూడిన కరపత్రాలను ఆలయ కమిటీ, గురుస్వామి మంత్రి అంజయ్య ఆవిష్కరించారు. నవంబర్ 22, 27 తేదీలలో గూడెం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమా చార్యులు, నవంబర్ 05, 24, 29, మరియు డిసెంబర్ 01 తేదీలలో మెట్ పల్లి గురుస్వామి మంత్రి అంజయ్యల ఆధ్వర్యంలో సామూహిక మాలధారణ కార్యక్రమాలు జరుగుతాయి. మాలధారణ చేసుకోవాలనుకునే భక్తులు మెట్ పల్లి ఆలయంలో సంప్రదించాలని ఆలయ కమిటీ సూచించింది.

# పండగకు పిలవలేదని కోర్టు నోటీసులు





**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూరులో మాలసంఘ మహిళలు అక్టోబర్ 15న 'గాజుల పండుగ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తనను పిలవలేదని, కారణం చెప్పాలని మాలసంఘానికి చెందిన అడ్వకేట్ కోంపల్లి సురేష్ భార్య అనిత సంఘ బాధ్యులకు కోర్టు నోటీసులు పంపారు. స్నేహితులంతా కలిసి చేసుకున్న పండుగకు తనను పిలవలేదని నోటీసు ఇవ్వడం సరికాదని సంఘ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

# కరాటే విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బెల్టులు అందజేత



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్ పల్లి మండలం బండలింగపూర్ గ్రామానికి చెందిన 30 మంది కరాటే విద్యార్థులు బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆదివారం బండలింగపూర్ గడి ప్రాంగణంలో జె.కె.ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరాటే శిక్షకులు నవీన్ మాస్టర్ విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు, బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. యుద్ధ విద్యలైన కరాటే విద్యలు విద్యార్థుల వ్యక్తిత్వ, శారీరిక, మానసిక వికాసానికి ఉపయోగపడతాయని, యువత ఆసక్తితో నేర్చుకోవాలని నవీన్ మాస్టర్ సూచించారు.

# టన్ను బరువున్న జోటూ దున్నపోతు
## సదర్ సమ్మేళనంలో ఆకర్షణ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హర్యానా నుంచి తెచ్చిన టన్ను బరువున్న జోటూ అనే దున్నపోతు, NTR స్టేడియం వద్ద నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గౌలిగూడ చమాన్ కు చెందిన యజమానులు దీనికి కాజు, బాదం, కొబ్బరి, బెల్లం, 10 లీటర్ల పాలు ఆహారంగా ఇస్తున్నామని తెలిపారు. చిన్నప్పటి నుంచి కుటుంబ సభ్యుడిగా చూసుకుంటున్నామని, ప్రతి సంవత్సరం సదర్ లో ఇది అదరగొడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సదర్ లో మొత్తం 17 దున్నపోతులు ప్రదర్శనకు రానున్నాయి.

# బీసీ రిజర్వేషన్ల కోసం
## బోడుప్పల్ లో బిఆర్ఎస్ ధర్నా




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు కోసం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్ల బస్ డిపో ముందు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీసీ సంఘాల నాయకులతో కలిసి మాజీ డిప్యూటీ మేయర్ కొత్త రవి గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల విషయంలో మొసలి కన్నీరు కారుస్తోందని, 42% రిజర్వేషన్లు ఇవ్వకుంటే భవిష్యత్తులో మరిన్ని నిరసనలు, ధర్నాలు చేస్తామని కొత్త రవి గౌడ్ హెచ్చరించారు.

# క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి. సుడా చైర్మన్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 19**
ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలకు విశేష స్పందన.ఖో ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళలు పురుషుల ఖో ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి జిల్లా క్రీడ పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించారని ముమ్ముందు మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. నిత్య శిక్షణతోనే క్రీడల్లో రాణించేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలుగా



నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఖో ఖో క్రీడలో కరీంనగర్ కు మంచి పేరు ఉందని గుర్తు చేశారు. ఈ పోటీల్లో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి 225 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఖో ఖో క్రీడను నిర్వహించి రాష్ట్రస్థాయిలో పాల్గొనే శిక్షణ శిబిరానికి 20 మంది మహిళలను, 20 మంది పురుషులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భాషా బోయిన వేణుగోపాల్, జిల్లా ఖో ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్ రావు, సంఘ ఉపాధ్యక్షులు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కోశాధికారి చిట్టి తిరుపతిరెడ్డి, జగిత్యాల జిల్లా సంఘ ప్రతినిధి డాక్టర్ ఏ రవీందర్,



సిరిసిల్ల జిల్లా సంఘ ప్రతినిధి ఎస్కే మోహినిద్దీన్, కరీంనగర్ జిల్లా సంఘ సభ్యులు వి సూర్యప్రకాష్, కట్ట సంతోష్, వి శ్రీలత, రేణుక, యోగేష్, కరుణాకర్, అశోక్, రాజబాబు, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారులు పండుగ ఆనంద్, వెంకటేష్, రాజు, జలంధర్, కోచ్ ఈ నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. పోటీల ముగింపు సమావేశానికి పెద్దపల్లి జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి ఏ సురేష్ ,సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఏ లక్ష్మణ్, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ టి రమేష్ లు హాజరై ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

# శాస్త్రీయ దృక్పథంతో అశాస్త్రీయ సవాలను చేదించాలి

- ముఖ్య అతిథి చెలిమెల రాజేశ్వరరావు
- వేములవాడలో జన విజ్ఞాన వేదిక వార్షిక సమావేశాలు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
శాస్త్రీయ దృక్పథంతో అశాస్త్రీయ సవాలను చేదించాలని ముఖ్య అతిథి చెలిమెల రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం వేములవాడ ప్రభుత్వ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా వార్షిక సమావేశం జిల్లా అధ్యక్షులు సిలివేరి సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ముఖ్యఅతిథిగా చెలిమెల రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక శాస్త్ర ప్రచారం చేస్తూ సామాజిక రుగ్మతను తొలగించే ప్రయత్నం చేస్తుందని, ముఖ్యంగా విద్యా, వైద్యం అనేక సామాజిక




సమస్యలపై అహర్నిశలు పోరాడుతూ సామాన్య ప్రజానీకానికి సైన్స్ ఫలాలు అందాలని కోరుకుంటుందని, భారతదేశం ఇంకా అభివృద్ధి చెందిన దేశం గానే మనం చెప్పుకోవడం అనేది గమనార్హం. దీనికి ప్రధాన కారణం సైన్స్ పట్ల భారతదేశ కృషి ఆశించిన స్థాయిలో లేకపోవడం. ప్రపంచ దేశాల్లో నోబెల్ బహుమతి పొందడంలో మన దేశం చాలా వెనుకబడిపోయిందని, ఇంతవరకు భారతదేశం నుంచి నోబెల్ ప్రైజ్ పొందిన భారత సంతతికి చెందినవారు నలుగురేనని, జ్ఞానవంతులను శాస్త్రవేత్తలను ప్రభుత్వాలు ప్రోత్సహించవలసిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మహేందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు గుర్రం అంజనేయులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు సి.రామరాజు, రాష్ట్ర బాధ్యులు సంపతి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు బక్క గోపాల్, ద్యావనపల్లి శ్రీహరి, గంప లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి మెడపట్ల కిషన్, జిల్లా కార్యదర్శి రాజలింగం జన విజ్ఞాన వేదిక సభ్యులు విజయ్ కుమార్,ఉత్తమ్ కుమార్ శంకర్, రాజి రెడ్డి, పండుగు రాజు, జింక శ్రీధర్, ప్రేమ్ సాగర్, నీరటి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సురక్షితంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలి

- పోలీసు వారి సూచనలను తప్పకుండా పాటించాలి
- వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు దీపావళి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలని, పోలీసు వారి సూచనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహణ ఉండాలని వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. దీపావళి సందర్భంగా పోలీస్ భద్రతా మార్గదర్శకాలను ఆదివారం జారీ చేశారు. అగ్నిప్రమాదాలు, గాయాలు శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు బాధ్యతాయుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు.

**- బాణసంచా భద్రతా సూచనలు:**
**- లైసెన్స్ పొందిన విక్రేతల వద్ద నుంచే పటాకులు కొనుగోలు చేయాలి.**
**- బహిరంగ ప్రదేశాలలో మాత్రమే పటాకులు కాల్చాలిబీ మండే పదార్థాలకు దూరంగా ఉండాలి.**
**- సింథటిక్ దుస్తుల కంటే కాటన్ దుస్తులు ధరించాలి.**
**- పిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే పటాకులు**



**కాల్చాలి.**
**- నీరు, ఇసుక లేదా అగ్నిమాపక యంత్రం సమీపంలో ఉంచాలి.**
**- 'డెడ్' క్రాకర్లను తిరిగి వెలిగించరాదుబీ 15%-%20 నిమిషాల తరువాత నీటిలో నానబెట్టాలి.**
**- ఇళ్లలో, టెర్రస్‌లపై లేదా మూసివేసిన ప్రదేశాలలో పటాకులు పేల్చరాదు.**
**- మనుషులపై లేదా జంతువులపై పటాకులు విసరరాదు.**
**- దీపాలు మరియు లైటింగ్ భద్రత:**
**- దీపాలు, కొవ్వొత్తులను స్థిరమైన, మండని ఉపరితలాలపై ఉంచాలి.**
**- కర్టెన్లు, కాగితపు అలంకరణలు, విద్యుత్ వైర్లకు దూరంగా ఉంచాలి.**
**- వెలిగించిన దీపాలను పర్యవేక్షణ లేకుండా వదిలిపెట్టరాదు.**
**- నాణ్యత కలిగిన విద్యుత్ లైట్లు మాత్రమే వాడాలిబీ సాకెట్లను ఓవర్‌లోడ్ చేయరాదు.**
**- శబ్దం మరియు పర్యావరణ పరిరక్షణ:**
**- సుప్రీంకోర్టు ఆదేశించిన సమయ పరిమితులను పాటించాలి.**
**- ఆసుపత్రులు, విద్యాసంస్థల సమీపంలో పటాకులు పేల్చరాదు.**

పర్యావరణహిత గ్రీన్ క్రాకర్లు వాడటానికి ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత మాకు అత్యంత ప్రాధాన్యమని, పటాకులను జాగ్రత్తగా ఉపయోగించి, చట్టపరంగా, బాధ్యతాయుతంగా దీపావళిని జరుపుకోవాలని ప్రతి ఒక్కరిని కోరారు. వేములవాడ పోలీస్ శాఖ చట్టం, శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజలందరికీ సురక్షితమైన, ఆనందభరితమైన దీపావళి కావాలని ఆకాంక్షిస్తోందని, సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలకు, పోలీస్ సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 42 శాతం రిజర్వేషన్ ను అమలు చేసేంతవరకు పోరాటము ఆగదు

- సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిటంగుటూరి రాజకుమార్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్19**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ను అమలు చేసేంతవరకు పోరాటము ఆగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజ్ కుమార్, మండల అధ్యక్షుడు ఏ బూసి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు...... ఈనెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన జమ్మికుంట బంద్ స్వచ్ఛందంగా, సంపూర్ణంగా జరిగిందని వారు తెలిపారు. ఈ బందుకు సహకరించిన వ్యాపార, వాణిజ్య సంస్థల, ప్రభుత్వ ,ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు, పట్టణ, మండల ప్రజలకు, కాంగ్రెస్, బిజెపి, సీపీఎం, సిపిఐ ,ఎస్సీ కుల సంఘ నాయకులకు, సహకరించిన ఇతర సంఘాల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ ను అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతుతో తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్ కు పంపించడం చాలా సంతోషం అన్నారు. సుప్రీంకోర్టుకు



అగ్రకులాలకు చెందిన ఒక వ్యక్తి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వరాదని పిటిషన్ వేయడంతో కోర్టు కొట్టి వేయడం బాధాకరమన్నారు. అయితే అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ కు మద్దతు ఇస్తున్నందున, కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీ నాయకులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని మోడీని ఒప్పించి పార్లమెంటులో బిల్లు పాస్ అయ్యే విధంగా చూడాలని కోరారు. లేనియెడల బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని ఇంకా ఉధృతం చేస్తామని వారు తెలిపారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలతో సహా అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ కు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారన్నారు. మరి ఈ పోరాటము ఏ పార్టీ పైన చేస్తున్నారని కొంతమంది మేధావులు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారని వారు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు 19 శాతం, బీసీలకు 50 శాతము మొత్తము 69 శాతం రిజర్వేషన్ అమలు జరుగుతుందన్నారు. అవసరమైతే ఆ రాష్ట్రంలో రిజర్వేషన్లు ఏ విధంగా అమలు చేస్తున్నారో ప్రత్యేకమైన కమిటీ వేసి ,దానిపై అధ్యయనం చేసి, తెలంగాణ రాష్ట్రంలో తప్పకుండా 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సమ్మెటసదానందం, దాసరి రామ్మూర్తి గౌడ్,ధర్మల శంకర్ ,రావుల తిరుపతి,గండి రంజిత్ కుమార్, కైలాసకోటి సమ్మయ్య,రా చమల్ల రవి,బూరుగుపల్లి రాము,పసునూటీమల్లికార్జున్,బూరుగుపల్లినాగరాజు,ష నగౌండ శ్రీనివాస్, రావుల రాజేందర్, రావుల అంజి తదితరులు పాలిన్నారు.